**Eenadu**

# తపాలాశాఖలో త్వరలో 55 వేల ఉద్యోగాల భర్తీ

- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో గంటల వ్యవధిలో నియామకాలు పూర్తి
- ఆ శాఖ కార్యదర్శి బీవీ సుధాకర్

ఈనాడు, హైదరాబాద్: 'దేశ వ్యాప్తంగా తపాలా శాఖ ఒకేసారి 55 వేల గ్రామీణ డాక్ సేవక్, పోస్టుమాస్టర్ ఉద్యోగాలు భర్తీ చేయనుంది. ఎనిమిది, పదో తరగతి మార్కుల ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయనుంది. మనుషుల ప్రమేయం లేకుండా కేవలం గంట సమయంలో పారదర్శక విధానంలో నియామకాలు పూర్తి చేసేందుకు సాఫ్ట్‌వేర్ సిద్ధం చేస్తోంది. దీన్ని 15 రోజుల్లో పరీక్షించి, నవంబరు నాటికి నియామకాలు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.' అని తపాలాశాఖ కార్యదర్శి బీవీ సుధాకర్ వెల్లడించారు. తపాలాశాఖ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగువారైన ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్‌సదన్‌లో ఏపీ సీపీజీఎం ఎం.సంపత్, తెలంగాణ సీపీజీఎం కల్నల్ ఇలీషాతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 'ఏపీ, తెలంగాణతోపాటు..దేశంలోని ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా లక్ష్యంగా జిల్లాకొకటి చొప్పున దేశవ్యాప్తంగా 650 తపాలా బ్యాంకులు ఏర్పాటుచేయనున్నాం. ఇందుకోసం ఓ సంస్థను నమోదు చేశాం. రూ.800 కోట్ల మూల పెట్టుబడిలో (రూ.400 కోట్లు గ్రాంటుగా, రూ.400 కోట్లు వాటాల రూపంలో) సెప్టెంబరు 2017 నాటికి అన్నింటినీ ప్రారంభిస్తాం. తెలంగాణలో జిల్లాల సంఖ్య పెరుగుతున్నందున, బ్యాంకులు లేని జిల్లాలకు ప్రాధాన్యమిస్తాం. ఈ బ్యాంకుల్లో ప్రతి వ్యక్తీ గరిష్ఠంగా రూ.లక్ష డిపాజిట్ చెయ్యొచ్చు. ఇందులో 75 శాతం ప్రభుత్వ బాండ్లు, మిగతా 25శాతం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పెట్టుబడిగా పెడతాం.

తొలి దశలో దిల్లీలోని తపాలా కార్యాలయంపై రూ.1.5 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్తు ప్లాంటు ఏర్పాటుచేస్తున్నాం. దేశవ్యాప్తంగా 4 వేల తపాలా శాఖ భవనాల్లోనూ సౌర పలకల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. తపాలాశాఖలో ఫిర్యాదుల కోసం 1924 పేరిట కాల్‌సెంటర్ ఏర్పాటు చేశాం. ఫిర్యాదును పరిష్కరించి, 24 గంటల్లో ఫిర్యాదుదారులకు సంబంధిత సమాచారమిస్తాం. దేశవ్యాప్తంగా తపాలా పొదుపు ఖాతాల్లో నగదు నిల్వలు రూ.4.48 లక్షల కోట్ల నుంచి రూ.4.79 లక్షల కోట్లకు చేరాయి.' అని సుధాకర్ వివరించారు.